

# పసిడిమనసులు

## - షర్మిల



### తప్పిన ప్రమాదం

**మర్రిపాలెం** నుంచి పెందుర్తి మారిపోయాం. అక్కడి నుంచి నా స్కూల్ కి రావటం కుదరదు. చాలాదూరం. అందుకని నన్ను అన్నపూర్ణమ్మ, నాగేశ్వరరావు మావయ్యల ఇంటి దగ్గర పెట్టాలనుకున్నారు.

అన్నపూర్ణమ్మ మా చిన్న నాయనమ్మ. ఆయన్ని నాగేశ్వరరావు మావయ్య అనేవాళ్లం ఎందుకో. నా సంబరం ఇంతా అంతా కాదు.

ఎందుకంటే మావయ్య గారి ఇల్లు సరిగ్గా సముద్రానికి ఎదురుగా వుంటుంది. మధ్యలో రోడ్డే అడ్డం. ఎప్పుడన్నా సెలవొస్తే చాలు అక్కడికే ఎల్తాము.

అన్నపూర్ణమ్మ దేముడికి కొట్టిన కొబ్బరి కాయలతో లౌజు చేసేది. అది ఎంత తెల్లగా వుండేదంటే పాల రంగులో వుండేది.

అమ్మా పిన్నీ బుర్రబద్దలు కొట్టుకునే వారు మనం ఎంత బాగా చేసినా కోవా రంగులో వస్తుంది ఎట్టా చేస్తుందో అని. అన్నపూర్ణమ్మ ఏం చేసినా ఎదురులేదు.

అట్టా అని బండెడు చెయ్యదు కొంచం కొంచం పొందికగా చేసేది. అసలైన ఆకర్షణ నాగేశ్వరరావు మావయ్య గారిదే.ఆయన వెదర్ డిపార్ట్మెంట్ లో పని చేసేవారు.

అందరూ డీఎస్ రావు గారు అని పిలిచేవారు.ఆయన ఎప్పుడూ జోక్స్ వేసి నవ్విస్తానే వుండేవారు. ఆయన మాటలకు అంతా చుట్టూ కూర్చుని నవ్వుతానే వుండేవారు.

మా పిల్లలికి ఆయన డిపార్ట్మెంట్ నుంచి తెచ్చే ఎర్ర బెలూన్లు అంటే వింత. అయ్యి మామూలు బెలూన్లల్లే కాదు పేద్దవి.

వాతావరణం పరీక్ష చేయడానికి ఆటిని ఆకాశంలోకి వదులుతారు . మేం మామూలుగా సైకిలు పంపుతో గాలి కొట్టిస్తే ఆకాశంలోకి ఎగరవు .

సాయంత్రం అయితే చాలు మమ్మల్ని తన రెండు చేతుల్లో ఒక్కొక్కళని పట్టుకుని సముద్రం అలల దగ్గరికి తీసికెళ్లి ఆడించే వారు.

ఇక అట్టాంటి చోటకి ఎళ్లడానికి నాకు బెంగేంటి. పైగా ఇద్దరు అక్కలు కవల పిల్లలు. ఆళ్లు నాకన్నా పదేళ్లు పెద్ద. డాక్టర్లు చదివే వారు.

బావ గారు కూడా డాక్టరే.

మనకి ఆళ్లంటే ఎంత ఆరాధనో ! ఆవాళ అన్నపూర్ణమ్మ ఇంటికి ప్రయాణం.

పెందుర్తిలో నన్ను బస్ వరకూ వచ్చి ఆంధ్రా యూనివర్సిటీ ఇన్ గేట్ దగ్గర దింపమని డ్రైవర్కి అప్పగించారు.

ఆ ప్రైవేటు బస్సులాళ్లంతా నాన్న బాబాయిలకి తెలిసినాళ్లే.

మొత్తానికి సూట్కేస్ కూడా ఆళ్లే దించి పెట్టారు.

అక్కడినుంచి యూనివర్సిటీ క్వార్టర్లు దాటి ఎర్రమట్టి దిబ్బలు దిగితే  ఎదురుగుండా సముద్రం చుట్టూ గోడ కట్టి ఆ మధ్యలో వున్న క్వార్టర్లు.

నేను అసలే అవతల పుల్ల ఇవతల పెట్టనని తిడతారు

ఇక ఆ సూట్కేస్ ఏం మోస్తాను ?కిందా మీదా పడి దానీ రెండు అడుగులకో సారి కింద పెట్టుకుంటా అన్నపూర్ణమ్మ ఇంటికి చేరాను.

గేటు దగ్గరే  మావయ్య గారు వున్నారు.

"ఓసినీ అదేంటే ఆ చెమట ! మీ నాయనమ్మ పెట్టిన వెన్నపూసంతా కరిగిపోయిందే ? ఇంత సూట్కేస్ ఎట్టా మోసుకొచ్చావే !

పున్నా!  అమ్మడు వచ్చింది , ఆళ్ల నాయనమ్మ పెట్టిన ఎన్నపూసంతా కరిగించేసిందే" అని సూట్కేసు ఆయనే తీసుకుని లోపల పెట్టారు.

అన్నపూర్ణమ్మని "పున్నా " అని పిలిచేవారు. ఆ రోజు నుంచి అన్నపూర్ణమ్మ హాస్టల్ లో నా చదువు మొదలైంది. నేను మిగతా సబ్జక్ట్ లు బాగానే చదివినా లెక్కల్లో మహా పూర్ .

లెక్కలంటే అంత భయం వున్నా కాంపోజిట్ మాథ్స్ తీసుకోమని నాన్న కోరిక .నాన్న మాట కాదనాలని కూడా తెలియనితనం.

ఇక ఇప్పుడు ఆ లెక్కల మోతని మోయక తప్పదు.  అసలే పదో తరగతి. ఇప్పుడు మావయ్యగారు నాకు లెక్కల మాస్టారయ్యారు .

ఆక్కలు , బావగార్లూ అంతంత లావు పుస్తకాలు మంచాల మీద ఏసుకుని చదివినాళ్లు  చదువుతున్నట్టే వుండే వారు. ఇక నేను చదవకపోతే బాగుంటందా .

కాకపోతే నా చెవులు ఎప్పుడెప్పుడు భోజనానికి రమ్మంటారా అని వెయిటింగ్. అందరం టేబుల్ చుట్టూ కూర్చుని తినేవాళ్లం.

అదే అమ్మ దగ్గర స్కూల్ నుంచి వచ్చిన దగ్గరి నుంచీ ఏదో ఒకటి నములుతానే వుంటా.

అన్నపూర్ణమ్మ స్కూల్ నుంచి రాగానే నాకూ అక్కలిద్దరికీ చిన్న చిన్న గిన్నెల్లో వేరుసెనగపప్పు , కప్పు టీ ఇచ్చేది. సరిగ్గా ఎనిమిదింటికి భోజనం.

ఇక నా పని ఎనిమిది ఎప్పుడవుతుందా అని చూడటమే.  ఈ లోగా మావయ్య గారూ , బావ గారూ లెక్కలు చెప్పే వారు.

బావ గారు డాక్టరైనా లెక్కలంటే చాలా ఇష్టం , పైగా ఆయనకీ నాకూ కవిత్వం అంటే ఇష్టం. ఎప్పుడన్నా శ్రీశ్రీ , తిలక్ కవిత్వాలు చదువుకునే వాళ్లం .

నేను అట్టాగే అత్తెసరు చదువుతో ఆగిపోయాను .

బావగారు డాక్టర్ వీర్రాజు ఆ తరవాత ఆంధ్రాలోనే మొదటి గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ అయ్యారు .

అన్నపూర్ణమ్మకి  చెట్లంటే ప్రాణం .

ఆమె పెంచే గులాబీలు , చామంతులు , రకరకాల పూలతో తోట కళకళ లాడేది .

ధనుర్మాసం అన్నాళ్లూ రాంక్రిష్ణా బీచ్ దగ్గరున్న పాండురంగడి గుడికి పొద్దున్నే చామంతి పూల  దండ పంపేది. సముద్రం ఇప్పుడు కొత్తగా కనిపించడం లేదు .

దాని పని దానిది , నా పని నాది. ఎప్పుడన్నా గది కిటికీలోనుంచి చూస్తా " ఎప్పుడూ ఆ ఘోష ఏంటి ?! నీకు ఇసుగు లేదా " అన్నట్టు చూసేదాన్ని . పొద్దున్న సాయత్రం సముద్రం నిండా పడవలే . నాగేశ్వరరావు మావయ్య గారు లెక్కలు చెప్తా అన్నారు ,

" ఇదుగో అమ్మడూ ! నువ్వు లెక్కల పరీక్షగనక తప్పావనుకో నేను సముద్రంలో దూకుతా ! నేను దూకానని మీ అన్నపూర్ణమ్మ దూకుతుంది , చెల్లెలు దూకిందని మీ నాయనమ్మ, ఆ తరవాత మీ తాత " ఇట్టా మొత్తం కుటుంబంలో అందరి పేర్లు చెప్పే వారు .

పరీక్షయ్యాయి వాళ్లందరి అదృష్టం బాగుండి పదో తరగతి పాస్ అయ్యాను . అన్నీ సబ్జెక్ట్ లూ ఫస్ట్ క్లాస్ , లెక్కలు ఎన్నని అడగరేం ! 37 మార్కులు .

35 పాస్ మార్కులైతే. నాకొచ్చినియ్యి ఒక రెండు మార్కులు ఎక్కువ . మొత్తానికి వాళ్ల అందరికీ ప్రాణ గండం తృటిలో తప్పింది .

*(వచ్చేనెల మరో కథ)*

Click here to share your comments